క్లుప్తంగా

రేపటిలోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలందరూ చదువుకోవాలనే ఉన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నాలుగో విడత అమ్మ ఒడికి సంబంధించి లబ్ధిదారులు ఈ నెల 27వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులందరికీ పథకం వర్తించేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించారు. ఈకేవైసీ పూర్తయిన లబ్ధిదారులకు జూన్ 28 నుంచి పథకం కింద లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. కాగా ఈ నెల 28న పార్వతీపురం జిల్లా కురుపాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో పథకం కింద రూ. 13 వేలు నగదును జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పీపుల్స్ మ్యాక్స్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గగుడి ఫ్లై ఓవర్ వద్ద పేదలకు, వాహన చోదకులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ జరిగింది. వందలాది మందికి పులిహోర, దద్దోజనం, మంచినీటి ప్యాకెట్లను సొసైటీ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కోశాధికారి జ్యోత్స్న మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలలో తమ వంతు పాత్ర ఎల్లప్పుడు పోషిస్తుంటామని, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన యహాలక్ష్మీ యజ్ఞం సందర్భంగా కూడా భక్తులకు మజ్జిగ వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కె. కార్తీక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ సత్యనారాయణ పురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి. వి.సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భగత్ సింగ్ రోడ్డు, దండమూరి రామ్మోహన్ వీధి, వందనపువారి వీధి, శివాలయం రోడ్డు శివరావు వీధి, బ్రహ్మయ్య పంతులు వీధి, నర్రా వారి వీధి, గిరి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున ఆయా ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

సామాజిక సేవతోనే సంతృప్తి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అరవై ఏళ్లు పైబడిన వారు పింఛన్‌తో ఇంటికే పరిమితం కాకుండా సమాజ సేవకు పునరంకితం కావడం ద్వారా సంతృప్తికర జీవితాన్ని పొందాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత సంస్థ నగర శాఖ వార్షిక సమావేశం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడిగా ఇమ్మానేని కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా దావులూరి సాంబశివరావు, సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడిగా చెరుకూరి బాబు, చైర్మన్‌గా వేమూరు బాబూరావు కోశాధికారిగా పగిడిపల్లి రాములను ఎంపిక చేశారు.

4 నుంచి కుట్టు మెషీన్‌పై శిక్షణ

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో వచ్చే నెల జూలై 4 నుంచి 13వ బ్యాచ్ కుట్టుమెషీన్ క్లాసులు జరుగుతాయని పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. ఆదివారం చర్చిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతే కాకుండా ఇప్పటి వరకు 400కు పైగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా మెషీన్‌లు ఇచ్చినట్టు చెప్పారు. పేదలకు సేవ చేసేందుకు ఈ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా వృద్ధులకు నెలనెలా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సమావేశంలో కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు సజ్జా జ్యోతి పాల్గొన్నారు.

కానూరులో ఘనంగా 2కే రన్

పెనమలూరు: అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా కానూరులో ఆదివారం 2కే రన్ చేశారు. నెహ్రూ యువ కేంద్రం, అశోక్ జిమ్ ఆధ్వర్యంలో జరిగిన 2కే రన్‌ను నెహ్రూ యువ కేంద్రం ఆఫీసర్ సుంకరరాము క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కానూరు ప్రధాన రహదారి, పంటకలువ, పోలీస్‌స్టేషన్, సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో పటమట ఎస్ఐ సత్యనారాయణ, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, వ్యాయామ క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సీనియర్ వ్యాయామ క్రీడాకారులను సన్మానించారు.

సర్కారు బడికి సరికొత్త సొబగులు

- రూ.3 కోట్లతో ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల అభివృద్ధి
- శరవేగంగా నాడు-నేడు పనులు



ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో నిర్మిస్తున్న నూతన తరగతి గదులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాడు-నేడు పథకంలో భాగంగా దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగర పాలకసంస్థ పాఠశాలలో రూ. 3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ 700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 26 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండగా ఒకరు డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇక్కడ నాణ్యమైన విద్యాబోధన వల్ల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా మార్కులు సాధిస్తున్నారు. పూర్ణిమ అనే విద్యార్థి పదో తరగతిలో 567 మార్కులతో సత్తాచాటింది. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడలలో సైతం రాణిస్తున్నారు. 9 మంది విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. 11 మంది విద్యార్థులు రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

నాడు-నేడుతో కొత్త రూపు..

గత ప్రభుత్వ హయాంలో శిథిలమైన తరగతి గదులు, చాలీచాలని టాయిలెట్‌లు, అరకొర వసతులతో విద్యాబోధన జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి చొరవతో నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు రూ. 3 కోట్లు మంజూరు అయ్యాయి. ఇక్కడ పాఠశాలలో సీటు కోసం రికమెండేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే పాఠశాల ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చురుగ్గా పనులు..

శిథిలమై ప్రమాదకరంగా మారిన తరగతి గదులను పడగొట్టి ఇక్కడ మూడు అంతస్తులతో విద్యార్థులకు సరిపడే విధంగా 18 తరగతి గదులను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అలాగే పాత భవనానికి అవసరమైన మరమ్మతు పనులను సైతం చేపట్టారు. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న ఎనిమిది టాయిలెట్‌లకు మరమ్మతులు చేయటంతో పాటు మరో 10 టాయిలెట్‌లను నిర్మిస్తున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్‌లు

మోడల్ పాఠశాలగా..



నాడు-నేడు పథకంలో భాగంగా రూ. 3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టాం. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించటంతో పాటు మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కొండాయగుంట మల్లీశ్వరి బలరామ్, కార్పొరేటర్

పారదర్శకంగా పనులు..



ఇక్కడ పనులు ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయి. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాం. పాఠశాలలో మౌలిక వసతులను మరింత మెరుగు పరుస్తున్నాం.

– సూర్యప్రభ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

సంగీతంతో ఒత్తిడి దూరం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఒత్తిడిని దూరం చేయడంలో సంగీతం గొప్ప సాధనమని సంగీతం అధ్యాపకురాలు మాధురి అన్నారు. సంగీతం వినటం వల్ల శరీరంలో మార్పులు సంభవిస్తాయని, కొన్ని రకాల వ్యాధులు దూరమవుతాయన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు సంగీతంలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శృతి, రాగం, తాళం, పల్లవి మొదలైనవి సంగీతానికి ప్రాథమిక లక్షణాలుగా పేర్కొన్నారు. శబ్దానికి శక్తిని కల్పించి సుస్వరంగా ఆలాపన చేయటమే గానం అంటారని వివరించారు. అనంతరం విద్యార్థుల చేత సరిగమపదనిస (సప్తస్వరాలు)లు రకరకాలుగా పలికే విధానంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, సిబ్బంది కుమార్, గోపాలరావు, దుర్గాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గురుపూర్ణిమ మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులోని శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలు ఆదివారం నాలుగోరోజుకు చేరుకున్నాయి. గురుపూర్ణిమ మహోత్సవాలలో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీసాయిబాబా జీవిత చరిత్ర, గురుచరిత్ర పారాయణం జరిగింది. ఆదివారం సెలవు దినం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వైవీ శివాజీ, ఎం. బాలవర్ధనరావు, ప్రసాద్ పర్యవేక్షించారు.

భక్తుల సౌకర్యార్థం మెరుగైన సేవలు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: భక్తుల సౌకర్యార్థం మెరుగైన సేవలు కల్పిస్తామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సుబ్బాయిగూడెం రోడ్డులోని మైత్రి రోడ్డు నుంచి శ్రీతిరుపతమ్మ వారి ఆలయం ముందు కల్యాణ వేదిక స్థలం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు, వందల సంఖ్యలో వాహనాలు వస్తుండటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యల్లో భాగంగా ఈరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. పనులు వెంటనే ప్రారంభిస్తారన్నారు. అలాగే కాజ్‌వే పక్క నుంచి మైత్రి రోడ్డు వరకు మునేరు పక్కన కరకట్ట నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీస్వయంభూ శంభు లింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్ పాల్గొన్నారు.

బొల్లిపై అపోహలు వద్దు



లబ్బీపేట(విజయవాడతూర్పు): బొల్లిపై అపోహలు వద్దని, బొల్లి అనేది అంటువ్యాధి కాదని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ మామిళ్ల బాలనరశింహులు అన్నారు. ప్రపంచ బొల్లి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నక్కల రోడ్డు, డోర్నకల్ రోడ్డు, ఏలూరురోడ్డుల్లో కొనసాగింది. డాక్టర్ బాలనరశింహులు మాట్లాడుతూ బొల్లి వంశపారంపర్యంగా వచ్చే అవకాశం తక్కువ అన్నారు. కొన్ని రకాల బొల్లిని సర్జరీతో నయం చేయవచ్చునని, బొల్లి అంటే కుష్టు వ్యాధి కాదన్నారు. ఈ వ్యాధి ఉన్న వారు నిరభ్యంతరంగా వివాహం చేసుకోవచ్చని పేర్కొన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా, అన్ని వయస్సుల వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. తొలిదశలో గుర్తించి చికిత్స పొందితే కొంత వరకూ బొల్లి వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



రైతుకు స్ప్రేయర్ అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని వాసవీ క్లబ్ విజయవాడ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఐఈసీ ఆఫీసర్ ఓలేటి శ్రీనివాసగుప్తా, కో ఆర్డినేటర్ పెరుమాళ్ల హరనాథ్ అన్నారు. ఆదివారం కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అనే రైతుకి క్రిమిసంహారక మందు స్ప్రే మిషన్, నాలుగు పేద కుటుంబాలకు రూ.6వేలు విలువైన నిత్యావసర సరుకులు, 10 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం మిలటరీ సైనికుడు ఎం.కోటిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాన్ టు డస్క్ చైర్మన్ పచ్చిపులుసు సాయిబాబు, వాసవీ క్లబ్ విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు తడికమళ్ల వెంకట సురేష్‌బాబు, వై.వి.వి.సత్యనారాయణ మూర్తి, కోశాధికారి బాలభాస్కర శేషగిరిరావు, రీజియన్ చైర్‌పర్సన్ ఎస్.సూర్యప్రకాష్‌రావు, సెక్రటరీ కె.బి.శివప్రసాద్, జోన్ చైర్‌పర్సన్ ఆత్మకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంగీత సద్గురువుల ఆరాధనోత్సవాలు



వాగ్గేయకార కీర్తనలను ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణా మూర్తి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు ఆరాధన మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఈ సంగీతోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ కళాకారులు ఉత్సవంలో పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు కస్తూరి గోపాలరావు శ్రీగణనాథం భజరే ఈశ ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన, సదామతిన్‌దలతుగదరా త్యాగరాజ స్వామి కీర్తన, ఎక్కడ చూసినా మనరాముడు మైసూర్ వాసుదాసు కీర్తన, దేవదేవం భజే, అన్నమాచార్య కీర్తన, దేవాదిదేవ శ్రీనివాసా మైసూర్ వాసుదేవాచారి తదితర కీర్తనలను ఆలపించారు. రాయప్రోలు అలేఖ్య, పారుపల్లి ఉజ్వల కార్తికేయ, ఎం. అంజనా సుధాకర్, వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. ఉదయం నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు నిర్వహించిన పంచరత్న కృతుల గోష్టిగానం ఆకట్టుకుంది. బీవీఎస్ఎస్ కృష్ణ, పారుపల్లి ఇభానన్, నేతి శివశంకర్, మార్టూర్ హరిబాబు, డాక్టర్ కె. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి



అధ్యక్షుడిగా ఎన్నికైన రమణకు అభినందనలు తెలుపుతున్న స్వామి, సంజయ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని హోటల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు పీవీ రమణ అన్నారు. నగరలోని ఓ హోటల్‌లో ఆదివారం విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా ఆర్‌ఆర్ హోటల్స్ అధినేత పీవీ రమణ, కార్యదర్శిగా పార్క్ ఎన్ హోటల్ నిర్వాహకులు వెలగపూడి రాఘవ, కోశాధికారిగా చలువాది మల్లిఖార్జునరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పీవీ రమణ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న హోటల్ నిర్వాహకుల సమస్యల సాధనకు తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. జూలై 6న గుణదలలోని హోటల్ హయత్‌లో రాష్ట్ర హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరగనున్నట్లు పీవీ రమణ తెలిపారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. లబ్బీపేట గ్రీన్‌ల్యాండ్స్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా పాల్గొని పేదలకు చీరలు, గోధుమపిండి, బియ్యంలతో కూడిన ప్యాక్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక్కో నియోజకవర్గంలో తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, హజ్ యాత్రికుల కూడా సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ కమిటీ తూర్పు అధ్యక్షుడు షేక్ కలందర్, ఎండీ జహీరుద్దీన్, రఫీ, భాష తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్



హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేస్తున్న గౌస్ మొహిద్దీన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ప్రభుత్వంలో మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. ఆదివారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని మక్కా మసీదులో హర్ దిల్‌మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ మక్కా మసీదులో నమాజ్ ఆచరించిన అనంతరం నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ముస్లిం మైనార్టీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడం నుంచి షాదీతోఫా ఆర్థిక సహాయం వరకు ప్రతి విషయంలోనూ ప్రభుత్వం అండగా ఉందన్నారు. మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. అనంతరం మసీదు వద్ద సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, షేక్ ఇస్మాయిల్, మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ కరీం, సెక్రెటరీ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి జాతీయ స్థాయి అవార్డు



అవార్డుతో విద్యార్థిని షణ్ముఖి

తాడేపల్లిరూరల్ : విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈనెల 16 నుంచి జరుగుతున్న సాంస్కృతిక పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థిని జాతీయ స్థాయి అవార్డును సాధించిందని యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన జె. షణ్ముఖి విజ్ఞాన యూనివర్సిటీలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచి, అవార్డు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్, వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి ఆర్. సుభాకర్ రాజు, 25వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కల్నల్ ఎస్. సిద్ధు తదితరులు షణ్ముఖిని అభినందించారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి




వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న హోమియోవైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ ఏవీఎస్కే ప్రసాద్, హోమియోవైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, అల్లోపతి వైద్యనిపుణుడు డాక్టర్ ఆదిత్య చంద్రభొట్ల అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా వృద్ధులు వేడి వేడి ఆహారంను తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

కాలువలకు కొత్త కళ



సుందరీకరణ తర్వాత బందరు కాలువలో పారుతున్న నీరు



మధురానగర్ ఏలూరు కాలువ ఫుట్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన మెష్



బందరు కాలువ వంతెనపై చెత్త వేయకుండా పహారా కాస్తున్న కార్మికుడు

నగరంలో పారుతున్న కాలువలకు కొత్త కళ వచ్చింది. వ్యవసాయ పనులకు కోసం అధికారులు నీరు విడుదల చేయడం.. కాలువల సుందరీకరణతో ఇప్పటికే నగర పాలక సంస్థ వాటిని శుభ్రం చేయడంతో నీరు ఎటువంటి ఆటంకాలు లేకుండా పారుతోంది. అంతే కాకుండా కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా వంతెనలకు మెష్‌లను ఏర్పాటు చేయటంతో పాటు వంతెనల వద్ద పారిశుద్ధ్య సిబ్బందిని కాపలా పెట్టారు. కాలువలో చెత్తాచెదారం వేయటం వల్ల కలిగే అనర్థాలను వివరించటంతో పాటు కాలువల పరిరక్షణకు సహకరించాలని వారు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– మధురానగర్(విజయవాడసెంట్రల్)